సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 27 । జూలై । 2025



ఉలిక్కిపడిన వరహాపట్నం
భూమిలో నుంచి వచ్చిన భారీ శబ్దం, మందుపాతర మాదిరి పేలుడుతో వరహాపట్నం గ్రామ ప్రజలు ఉలిక్కిపడ్డారు.
8లో ▸



వర్జీనియా ధర పతనం
వర్జీనియా పొగాకు వేలం ధరలు అమాంతంగా పడిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.
8లో ▸



మార్మోగిన గోవింద నామస్మరణ
గోకుల తిరుమల పారిజాతగిరిలో గిరి ప్రదక్షిణ మార్గాన్ని శనివారం వేదమంత్రోచ్ఛరణలతో ప్రారంభించారు.
8లో ▸

న్యూస్‌రీల్

నరసాపురంలో ఉగ్ర గోదావరి



వశిష్ట గోదావరి వలంధర్ రేవు వద్ద గోదావరి ప్రవాహం

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఐదు రోజులుగా ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. వలంధర్ రేవులో పిండ ప్రధానాలు చేసే షెడ్డుపైకి నీరు చేరింది. గోదావరి మాత విగ్రహం వద్ద నీటిమట్టం పెరిగింది. వలంధర్ రేవు వద్ద నిషేధాజ్ఞలు విధించారు. సముద్ర పోటు సమయంలో నీటి మట్టం మరింత పెరుగుతోంది. పట్టణ పరిధిలో ఐదు చోట్ల అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నుంచి గోదావరి నీరు ఎగదన్నుతోంది. గోదావరి బండ్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాలు వరద తాకిడి గురయ్యే ప్రమాదం ఉంది.

మళ్లీ పెరిగిన గోదావరి



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి

వేలేరుపాడు: ఎడతెరిపి లేని వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద శనివారం రాత్రి 35.40 అడుగులకు నీటిమట్టం చేరింది. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే దారిలోని ఎద్దెలవాగు వంతెన ఉదయమే నీటమునిగింది. దీంతో దిగువన ఉన్న 18 గిరిజన గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కొయిదా, కట్కూరు, కాచారం, తాళ్ల గొంది, పూసుగొంది, చిట్టంరెడ్డిపాలెం, ఎడవల్లి, బుర్రెడ్డిగూడెం, టేకూరు, సిద్దారం, కుంకుడు కొయ్యలపాకలు మరో ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు తహసీల్దార్ సత్యనారాయణ ఎద్దెలవాగు వద్ద నాటు పడవను ఏర్పాటుచేశారు.

5.53 లక్షల క్యూసెక్కులు దిగువకు..

పోలవరం రూరల్: పోలవరం వద్ద గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. ప్రాజెక్టు దిగువన స్పిల్‌వే వద్ద 30.400 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 5.53 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వదులుతున్నారు. దీంతో దిగువన వరద ప్రవాహం పెరుగుతోంది. భారీ వర్షాలతో మరో రెండు రోజుల పాటు వరద పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

గళమెత్తిన ఉపాధ్యాయులు



భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఉపాధ్యాయులు బోధన కంటే బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందని యూటీఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. యాప్‌ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్‌లో అనేక సమాచారాలు పెట్టమంటూ పనిభారం పెంచుతున్నారన్నారు. ఏ మాత్రం సంబంధం లేని పీ4 వంటి విషయాలను ఉపాధ్యాయులపై మోపడం సమంజసం కాదన్నారు. బదిలీలు అయిన వారికి రిలీవ్ ఉత్తర్వులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న జీతాల సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఉపాధ్యాయులు హెచ్చరించారు.

నేడు ఎయిడెడ్ టీచర్ నియామక పరీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి, కోట్ల వెంకట రామయ్య బాలికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న 7 ఎయిడెడ్ టీచర్ పోస్టులకు ఆదివారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. రెండు సెషన్లలో పరీక్ష జరుగనుంది. భీమవరం డీఎన్నార్ కాలేజీ అటానమస్, డీఎన్నార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్, తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు. హాల్‌టికెట్ కోసం 99892 71919 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

వసతి..అధోగతి

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలను సర్కారు నిర్లక్ష్యం పట్టిపీడిస్తోంది. పరిసరాల్లో పారిశుద్ధ్య లేమి.. సరిగాలేని టాయిలెట్స్.. తాగునీటి సమస్యలు.. దోమల బెడద.. నాణ్యత లేని ఆహారం.. విరిగిన బల్లలు.. మంచాలు లేక కటిక నేలపై నిద్ర.. వంటి సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. మౌలిక వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు.



నేలపై నిద్ర.. దోమల మోత.. తాడేపల్లిగూడెం రూరల్ కడకట్ల బీసీ బాలుర హాస్టల్‌లో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

సంక్షోభంలో సంక్షేమం
- ప్రభుత్వ వసతి గృహాలను వెంటాడుతున్న సమస్యలు
- తాగునీరు, పారిశుద్ధ్య లేమి.. అధ్వానంగా మరుగుదొడ్లు
- చీకటి పడితే దోమల బెడద
- అవస్థలు పడుతూ సాగుతున్న విద్యార్థుల చదువులు
- జిల్లాలో 68 హాస్టళ్లు.. 5,329 మంది విద్యార్థులు

జిల్లాలో వసతి గృహాలు

కేటగిరీ	సంఖ్య	విద్యార్థులు
బీసీ హాస్టళ్లు	29	1,585
ఎస్సీ హాస్టళ్లు	35	1,624
గురుకుల పాఠశాలలు	2	} 2,120
కళాశాలలు	2	

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి, భీమవరం: జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 16 బాయ్స్, 13 గరల్స్ హాస్టళ్లు ఉండగా, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 15 బాయ్స్, 20 గరల్స్ హాస్టళ్లు ఉన్నాయి. మొత్తం 64 హాస్టళ్లకు గాను 32 హాస్టళ్లకు సొంత భవనాలు ఉండగా మిగిలినవి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. తాడేపల్లిగూడెం రూరల్ ఆరుగొలను, నరసాపురం రూరల్ ఎల్‌బీచర్లలో గురుకుల కళాశాలలు, పెనుగొండలో గురుకుల బాలికల పాఠశాల, తాడేపల్లిగూడెం రూరల్ పెదతాడేపల్లిలో గురుకుల బాలుర పాఠశాల ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా వసతి గృహాల్లో 5,329 మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. హాస్టల్స్‌లోని పరిస్థితులపై జిల్లావ్యాప్తంగా 'సాక్షి' జరిపిన పరిశీలనలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వెలుగుచూశాయి.

సమస్యలు కోకోల్లలు

- పెనుమంట్ర మండలం పాలమూరులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 25 మంది విద్యార్థులు ఉన్నారు. రూ.14 లక్షలతో చేపట్టిన హాస్టల్ భవనం, టాయిలెట్స్ మరమ్మతు పనులు ఆరు నెలలుగా నత్తనడకన సాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మంచాలు లేక నేల మీదే పడుకుంటున్నారు. జనరేటర్ గాని, ఇన్వెర్టర్ గాని లేక రాత్రి సమయంలో కరెంట్ పోతే ఇబ్బంది పడాల్సి వస్తోందని, రక్షిత నీటిని అందించే ఆర్‌ఓ ప్లాంట్ లేదని విద్యార్థులు చెబుతున్నారు. ట్యూటర్ లేక సాయంత్రం స్టడీ అవర్స్ సక్రమంగా జరగట్లేదు.



పాలమూరు హాస్టల్‌లో నేలపైనే భోజనాలు



భీమవరం బీసీ హాస్టల్-2లో ఫ్యాన్లు లేని గది



నరసాపురం బాలుర హాస్టల్‌లో టాయిలెట్ ఇలా..

- భీమవరంలో ఒక ఎస్సీ, ఒక బీసీ బాలికల హాస్టల్, మూడు బీసీ బాయ్స్ హాస్టల్స్ ఉన్నాయి. పీపీ రోడ్డులోని బీసీ బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థులకు కనీసం పరుపులు లేవు. టాయిలెట్స్ నిర్వహణ సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మెంటేవారితోటలోని బీసీ బాయ్స్ హాస్టల్‌లో విద్యుత్ బోర్డు ప్రమాదకరంగా ఉంది. ఫ్యాన్ల మరమ్మతులకు గుర్రై పనిచేయడం లేదు. టాయిలెట్స్ సరిగా లేవు. తాగునీటి సమస్య ఉంది. సన్న బియ్యం మూడు రోజులు మాత్రమే పెట్టారని, కోడిగుడ్లు సక్రమంగా ఇవ్వడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.
- నరసాపురంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద గల బీసీ బాయ్స్ హాస్టల్‌లో గుమ్మాలు చెదలు పట్టేసి కన్నాలు పడిపోవడంతో క్రిమికీటకాల బెడద ఉంది. బల్లలు లేక నేలమీద చదువుకోవడం, భోజనాలు చేయడం, నిద్రించాల్సి వస్తోందని, గోదావరి గట్టున ఉన్న హాస్టల్‌లో టాయిలెట్స్ శిథిలావస్థకు చేరి దుర్గంధం వెదజల్లుతున్నాయని, ఎల్‌బీ చర్ల గురుకుల పాఠశాలలో బల్లలు విరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు అంటున్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ పెంటపాడులోని ఎస్సీ హాస్టల్ నుంచి స్కూల్‌కు వెళ్లే దారి అధ్వానంగా ఉంది. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో రాత్రిళ్లు నిద్ర ఉండటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ గరల్స్ హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో పాఠశాలలోని అరకొర గదుల్లోనే నిర్వహిస్తున్నారు.
- ఆకివీడులోని బీసీ హాస్టల్ వెనుక భాగంలో కిక్కిస దట్టంగా పెరిగిపోగా, ముందు భాగంలో డ్రెయిన్ పూడుకుపోయి మురుగునీరు హాస్టల్ ఆవరణలోకి వచ్చేస్తోంది. పరిసరాల్లో పారిశుద్ధ్య లేమితో దోమల సమస్య ఎక్కువగా ఉంది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాయ్స్ గురుకుల పాఠశాలలో 208 మంది విద్యార్థులకు ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. సబ్జెక్టు టీచర్లు లేరు. టాయిలెట్స్ నిర్వహణ సరిగా లేదు. బెడ్స్ సదుపాయం లేక విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు.
- పాలకొల్లులోని ఎస్సీ గరల్స్ హాస్టల్‌లో బెడ్స్ లేక నేలపై పరుపులు వేసుకుని పడుకోవాల్సి వస్తుందని విద్యార్థినులు అంటున్నారు.

శుభ్రం చేయించాలి



ఆకివీడులోని బీసీ బాయ్స్ హాస్టల్ ఆవరణలోకి మురుగు నీరు చేరి దుర్గంధం వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నాం. హాస్టల్ వెనుక భాగంలో మొక్కలు దట్టంగా పెరిగి పాములు వస్తున్నాయి. హాస్టల్ ఆవరణను శుభ్రం చేయించాలి.

– దండే ప్రేమ్‌కుమార్, 8వ తరగతి విద్యార్థి, ఆకివీడు

దోమలతో నిద్ర కరువు



రెండేళ్లుగా హాస్టల్‌లో ఉంటున్నాను. హాస్టల్ రూమ్‌లో డోర్లు పాడైపోయి చిల్లులు పడటంతో రాత్రిళ్లు దోమల సమస్యతో నిద్ర ఉండటం లేదు. తలుపులకు మరమ్మతులు చేయించాలి.

– పి.హరి, 8వ తరగతి, బీసీ బాయ్స్ హాస్టల్ విద్యార్థి, నరసాపురం

జీతాలు ఇప్పించండి



గురుకుల హాస్టల్‌లో హెల్పర్‌ని. ఏడు నెలలుగా జీతాలు లేవు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఇక్కడ హాస్టల్‌లో చూస్తే పని ఎక్కువగా ఉంటుంది.

– గుంపుల రాంబాబు, హెల్పర్, గురుకుల పాఠశాల, ఎల్‌బీ చర్ల

వాగులే ఆవాసం.. పాములే ఆహారం

- అత్యంత ప్రమాదకరం గిరినాగులు
- పాపికొండల అభయారణ్యంలో సంచారం



గిరినాగు (కింగ్ కోబ్రా) అత్యంత ప్రమాదకరమైన సర్పం. దట్టమైన అటవీ ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి. అరుదైన సర్పజాతికి చెందిన గిరినాగులకు ఇతర పాములే ఆహారం. వర్షాకాలంలో పాములను తినేందుకు ఇవి బయటకు వస్తుంటాయి. పాపికొండల అభయారణ్యంలోని జలతారు వాగు సమీపంలో వీటి జాడ ఎక్కువగా ఉన్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. అరుదైన గిరినాగులు కనిపిస్తే చంపవద్దని, తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

సండే స్పెషల్

బుట్టాయగూడెం: ఏలూరు, అల్లూరు సీతారామరాజు జిల్లాల మధ్య 1,01,200 హెక్టార్ల పరిధిలో పాపికొండల జాతీయ వన్య మృగ అభయారణ్యం విస్తరించి ఉంది. అరుదైన జంతు జాలానికి నిలయంగా ఉన్న ఈ అభయారణ్యంలో గిరి నాగుల సంచారం ఎక్కువగా ఉంది. దట్టమైన అటవీ ప్రాంతాలకు పరిమితమయ్యే ఈ సర్పాలు అత్యంత విషపూరితం. అలాగే ఇవి అరుదుగా కనిపిస్తాయి. అయితే ఇటీవల ఇవి జనావాసాల్లోకి వస్తున్నాయి. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో గిరినాగులు కనిపించినట్టు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా పాపికొండల అభయారణ్యంలోని జలతారు వాగు పరిసర ప్రాంతాలు వీటికి అడ్డాగా మారాయని వైల్డ్ లైఫ్ అధికారులు అంటున్నారు.

ఆహారం కోసం బయటకు..

మార్చి నుంచి జూలై వరకు గిరినాగులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అటవీ ప్రాంతంలో జల వనరులు తగ్గినప్పుడు నీటి చెమ్మను వెతుక్కుంటూ బయటకు వస్తుంటాయి. రబీ సీజన్ అనంతరం ఇతర పాములు పొలాల్లో ఉండటంతో ఆహారం కోసం వాటిని వెతుక్కుంటూ గిరినాగులు వస్తుంటాయి. గతేడాది వర్షాకాలంలో బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం సమీపంలో, ఇనుమూరు, జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం అటవీ ప్రాంతంలో, ఇటీవల గడ్డపల్లి, ముంజులూరు, తంగేడికొండ, దారావాడ, కోండ్రుకోట అటవీ ప్రాంతాల్లో గిరినాగులు కనిపించినట్టు ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. పాపికొండల అభయారణ్యంలో గిరినాగులతో పాటు పది అడుగుల తాచు పాములు, రక్తపింజర వంటి ప్రమాదకరమైన పాములు కూడా ఉన్నాయి.

పట్టుకుని అడవిలో వదిలేస్తూ..

ఇటీవల కాలంలో వర్షాకాలంలోనూ గిరిజనులు పొలాల్లో సంచరిస్తున్నాయి. వీటి సమాచారం అందిస్తే ఫారెస్ట్ అధికారులు వాటిని పట్టుకుని మళ్లీ అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు. ఇవి అరుదైన పాములు కావడంతో వాటి సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

- గిరినాగులు 14 నుంచి 20 అడుగుల పొడవు ఉంటాయి.
- మగ గిరినాగులను ఆకర్షించేందుకు ఆడ గిరినాగులు ఫెరోమోన్స్ అనే రసాయన పదార్థాన్ని వెదజల్లుతాయి. ఆ వాసన బట్టి మగ గిరినాగులు వాటిని అనుసరిస్తాయి.
- గిరినాగులు కాటు వేస్తే 10 నిమిషాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.
- గిరినాగులు రక్తపొడ, తాచుపాము, కట్లపాము, జెర్రిగొడ్డు వంటి పాములను ఆహారంగా స్వీకరిస్తాయి.
- గిరినాగులు గుడ్లు పెట్టి 18 రోజులపాటు పొదుగుతాయి. 21వ రోజున పిల్లలు బయటకు వస్తాయి.
- పాపికొండల అభయారణ్యంలోని జలతారు వాగు ప్రాంతంలో వీటి సంచారం ఎక్కువగా ఉంది.

కనిపిస్తే సమాచారం ఇవ్వండి



పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో గిరినాగులు కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వండి. ప్రాణభయంతో పాములను చంపవద్దు. మాకు సమాచారం ఇస్తే వాటిని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేస్తాం. ఈ పాములు అరుదైనవి. అభయారణ్యంలో వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– ఎస్‌కే వల్లీ, రేంజ్ అధికారి, పోలవరం


అత్యంత ప్రమాదకరం



గిరినాగులు అత్యంత ప్రమాదకరం. వీటిని పట్టుకోవడం అంత సులువు కాదు. పాపికొండలు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో ఇవి కనిపిస్తున్నట్టు ఫోన్‌లు వస్తున్నాయి. గిరినాగు కనిపిస్తే ఎవరూ చంపవద్దు. 8099855153 నంబర్‌కు ఫోన్ చేస్తే నేను వచ్చి పట్టుకుని వాటిని అడవిలో వదిలేస్తా.

– చదలవాడ క్రాంతి, స్నేక్ సేవియర్స్ సొసైటీ వ్యవస్థాపకుడు, జంగారెడ్డిగూడెం

20 అడుగుల పొడవు



గిరినాగు పాము చాలా ప్రమాదమైంది. 20 అడుగుల పైగా పొడవు ఉంటుంది. బాగా ముదిరిన పాము చాలా డేంజర్. నేను చాలాసార్లు వాటిని చూశాను. అటవీ ప్రాంతంలో పర్యటించినప్పుడు అవి కనిపిస్తే పరుగులు తీసేవాళ్లం.

– ఎస్.ప్రసాద్, బుట్టాయగూడెం

మనుషులపై దాడి చేయవు



గిరినాగులు సాధారణంగా మనుషులపై దాడి చేయవు. అయితే వాటిని భయపెట్టడం లేదా రెచ్చగొట్టడం చేస్తే కాటు వేస్తాయి. ఇది చాలా విషపూరితమైన పాము. కాటు వేస్తే మరణమే తప్ప జీవించే అవకాశం ఉండదు. చాలా జాగ్రత్తగా ఉండాలి.

– గంధం విక్టర్, బుట్టాయగూడెం

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం



వీరవాసరంలో జరిగిన బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాదరాజు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

వీరవాసరం: బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని నౌడూరు జంక్షన్‌లో శనివారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని భీమవరం ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రసాదరాజు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు వైఎస్సార్‌సీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నవరత్నాల పేరుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం పురోగతి సాధించిందన్నారు.

సూపర్ సిక్స్‌తో మోసం

పార్టీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసిందని, హామీలను తుంగలో తొక్కి పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. భీమవరం నియోజకవర్గ కన్వీనర్ చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు, అభిమానులకు ఏ చిన్న సమస్య వచ్చినా ముందుంటానని హామీ ఇచ్చారు. నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరు ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలతో పాటు అన్నివర్గాలనూ కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని మండిపడ్డారు. అనంతరం వీరవాసరం మండల, గ్రామ, అనుబంధ విభాగాల కమిటీల సామూహిక ప్రమాణ స్వీకారోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చావాకుల సత్యనారాయణ మూర్తి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, మాజీ జెడ్పీటీసీ మానుకొండ ప్రదీప్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు గూడూరి ఓంకారం, నేతల జ్ఞాన సుందరరాజు, కామన నాగేశ్వరరావు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, జల్ల కొండయ్య, గాదిరాజు రామరాజు, పి.మంగ, డీవీడీ ప్రసాద్, చికిలే మంగతాయారు, వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాళీపట్నం భూసమస్యలు పరిష్కరిస్తాం

నరసాపురం: కాళీపట్నం భూసమస్యలపై అధ్యయనం చేసి పరిష్కరిస్తామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కాళీపట్నం భూముల శాశ్వత భూ హక్కు చట్టం, 22ఏ భూసమస్యలు, అన్‌సెటిల్డ్ ఎస్టేట్ భూసమస్యలపై సమీక్షించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయకర్, ఆర్డీఓ దాసి రాజు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

ఏలూరు(మెట్రో): ఏపీపీఎస్సీ ద్వారా ఆదివారం నుంచి ఆగస్టు 1 వరకు జరిగే పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఏపీపీఎస్సీ 04/2025 నోటిఫికేషన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు.



క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైనరోజు, అందులోనూ గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం తగ్గడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

గంజాయి ముఠా అరెస్ట్

ఆకివీడు: స్థానిక వెంకయ్య వయ్యేరు కాల్వగట్టు, ప్యాట్రిక్ నగర్, రైల్వే బ్రిడ్జి సమీపంలో ఐదుగురు వ్యక్తులు శనివారం గంజాయి క్రయ, విక్రయాలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లికి చెందిన పోడియం జగదీష్ మణికంఠ, తణుకు మండలం దువ్వకు చెందిన ప్రదీక్షణం రవి 30 కిలోల గంజాయిని తీసకువచ్చి చెరుకుమిల్లి గ్రామానికి చెందిన వేగేశ్న పవన్ కల్యాణ్ వర్మ, స్థానిక సమతానగర్‌కు చెందిన కొమ్మారెడ్డి సత్యనారాయణ, స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని నైనారు ప్రసాద్‌లకు విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. గంజాయి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ జగదీశ్వరరావు చెప్పారు. దాడుల్లో పోలీస్‌సిబ్బంది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి అంజనేయులు, వీఆర్వోలు మన్నే శ్రీను, శ్యామ్ పాల్గొన్నారు.

2న జెడ్పీ సమావేశం

ఏలూరు(మెట్రో) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో శ్రీహరి ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

లైన్‌మేన్ ఆత్మహత్య

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఎంప్లాయిస్ కాలనీలో అద్దెకు నివాసం ఉంటున్న 11వ వార్డు సచివాలయం లైన్‌మేన్ ఎం.రాజీకుమార్ శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తండ్రి కర్నేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాజి తెలిపారు. మృతుడికి 3 నెలల క్రితం వివాహమైంది. అతడి స్వగ్రామం ఉండి మండలం ఉప్పులూరు అని, భీమవరం 11వ వార్డు సచివాలయంలో లైన్‌మేన్‌గా పనిచేస్తున్నాడని ఎస్సై చెప్పారు.

వర్జీనియా ధర పతనం

రూ.390 నుంచి రూ.370కి పడిపోయిన ధర


కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు వేలం ధరలు అమాంతంగా పడిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. శనివారం కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన కొనుగోళ్లలో నాణ్యమైన పొగాకు ధర కేజీకి రూ. 390 నుంచి ఒక్కసారిగా రూ.370కు పడిపోవడంతో రైతులు నిరుత్సాహానికి గురయ్యారు. పొగాకును కొనుగోలు చేసే ప్రధాన కంపెనీకి చెందిన అలయన్ కంపెనీ కొనుగోళ్ల నుంచి తప్పుకోవడం ధరల పతనానికి కారణంగా తెలిసింది. దీంతో మిగిలిన కొనుగోలుదారులు ఇదే అదునుగా భావించి పొగాకు ధరను తగ్గించి కొనుగోలు చేయడానికి సిండికేట్‌గా మారారని రైతులు ఆరోపించారు. మార్చి నెలలో రూ. 290తో ప్రారంభమైన వర్జీనియా పొగాకు కొనుగోలు సుమారు 4 నెలలకు గాని రూ.390కు చేరుకోలేకపోయిందన్నారు. కాగా ధర మరింత పతనం అయ్యే అవకాశం ఉందని, ఇందుకు కంపెనీలు సిద్ధం అవుతున్నాయని ప్రధాన కంపెనీలోని ప్రైవేటు ఉద్యోగి ఒకరు పేర్కొన్నారు. విదేశీ ఆర్డర్లు లేవంటూ సాకు చూపిస్తున్నారని క్లూ ఇచ్చారు. ఇచ్చిన అనుమతుల కంటే పరిమితికి మించి పంటను ఉత్పత్తి చేయడం వలన ఏర్పడిన సంక్షోభం ఇది అని బోర్డు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

ధర పతనంతో ఆందోళన



ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఎదురైంది. గతంలో కంటే కూడా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేశాం. బోర్డు అధికారుల సూచనలు పాటిస్తూ అన్య పదార్థాలు లేకుండా గ్రేడ్ వన్ పొగాకు ఉత్పత్తి చేసి మద్దతు ధర ఆశించాం, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ధర పతనం చూస్తుంటే ఆందోళన కలుగుతుంది.

– కాకర్ల వివేకానంద, వర్జీనియా పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు, కొయ్యలగూడెం

సగం కూడా కొనుగోలు చేయలేదు



ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల్లో సుమారు 82 మిలియన్ల కేజీల పొగాకు విక్రయించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు అందులో సగం కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతుల వద్ద మిగిలి ఉన్న పొగాకు నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. లోగ్రేడ్ ధర రూ.250కు దిగజారకుండా ఉండగలిగితే రైతుకు కొంతైనా ప్రయోజనం చేకూరుతుంది.

– పరిమి రాంబాబు, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం

ఉలిక్కిపడిన వరహాపట్నం

- భూమి నుంచి భారీ పేలుడు
- బాంబులంటూ భయపడిన ప్రజలు
- ముగ్గురికి స్వల్ప రాళ్ల గాయాలు
- బాంబ్, డాగ్ స్క్వాడ్‌ల పరిశీలన


పేలుడు ప్రాంతం వద్ద పొక్లెయిన్‌తో తవ్వుతున్న దృశ్యం


పేలుడు ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్ పరిశీలన

కైకలూరు: భూమి నుంచి వచ్చిన భారీ శబ్దం.. మందుపాతర మాదిరిగా పేలడంతో శనివారం వరహాపట్నం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. బాంబులంటూ ప్రజలు భయాందోళన చెందారు. వివరాల ప్రకారం వరహాపట్నం నుంచి కలిదిండి వెళ్లే రహదారిలో కూడలి వద్ద సేద తీరే సిమెంటు బెంచీపై ఉదయం ముగ్గురు యువకులు కూర్చుని కబుర్లాడుకుంటున్నారు. ఇంతలో సమీప భూమి నుంచి రెండు లారీ టైర్లు ఒక్కసారిగా పేలిన శబ్దం వచ్చింది. ఆ ప్రాంతమంతా దుమ్ముతో నిండిపోయింది. బెంచీపై కూర్చున్నా కోనాల నానీ, పడమటి శివగణేష్, సోమగాని కార్తీక్‌లకు స్వల్పంగా రాళ్ల గాయాలయ్యాయి. గ్రామస్తులు రూరల్ ఏఎస్సై వెంకటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన సిబ్బందితో వచ్చి గాయపడిన యువకుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఏలూరు నుంచి బాంబు, డాగ్ స్క్వాడ్‌లు వచ్చాయి. పొక్లెయిన్‌తో పేలుడు సంభవించిన ప్రాంతాన్ని తవ్వి బాంబుకు సంబంధించి ఎటువంటి అనవాళ్లు లేవని నిర్ధారించారు. ఇదిలా ఉంటే రెండు రోజుల క్రితం వర్షపు నీరు వెళ్లడానికి పేలుడు సంభవించిన కొంత దూరంలో డ్రెయిన్‌ను తవ్వారు. పేలుడు జరిగిన చోట గతంలో మెకానిక్ షెడ్, ఎలక్ట్రికల్ రిపేరు షాపు ఉండేదని గ్రామస్తులు చెప్పారు. భూమిలో బ్యాటరీ కాని, భూమి అడుగున కూల్ డ్రింక్ సీసాలలో గ్యాస్ వల్ల పేలుడు సంభవించి ఉండవచ్చని భావిస్తున్నారు. హఠాత్తుగా జరిగిన పరిణామంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ప్రజలు భయపడవద్దని పోలీసులు చెప్పారు.

మార్టేరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తకు పురస్కారం


రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త డాక్టర్ వై సునీత

పెనుమంట్ర : మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వై సునీతను ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో ఉత్తమ అవార్డుతో సత్కరించారు. ఈ నెల 24వ తేదీన కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూర్ స్వర్ణభారత్ ట్రస్ట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరులో సస్య ప్రజనన విభాగంలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డా. వై. సునీత 2011 నుంచి చేసిన విశిష్ట సేవలకు గాను 'మెరిటోరియస్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డు' అందుకున్నారు. ఆమె మార్టేరు (18 రకాలు), బాపట్ల (5 రకాలు) వరి పరిశోధనా స్థానాల నుంచి మొత్తం 23 వరి రకాల అభివృద్ధి, విడుదలలో భాగస్వామిగా ఉన్నారు. అదనంగా 1 జన్యు స్టాక్ అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు డీడీఆర్. డా. టి. శ్రీనివాస్, ఇతర శాస్త్రవేత్తలు, సిబ్బంది అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ భవనాలకే రక్షణ లేదు..!

- బొండాడలో సామూహిక మరుగుదొడ్ల భవనం కూల్చివేత
- పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


సచివాలయం అనుకుని నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను కూల్చివేసిన ప్రాంతం

కాంప్లెక్స్ ను కూల్చి పక్కకు పడేసిన పిల్లర్లు

కాళ్ల: లక్షలాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు సైతం ప్రైవేటు వ్యక్తులు కూల్చివేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పట్టపగలు అందరూ చూస్తుండగా ఇలాంటి దౌర్జన్యంకు పాల్పడుతున్నా అధికారులు సైతం మిన్నకుండిపోవడం గమనార్హం. కాళ్ల మండలం బొండాడ గ్రామంలో సామూహిక మరుగుదొడ్ల భవనం (కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్) కూల్చివేత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... గత ప్రభుత్వ హయాంలో బొండాడ గ్రామంలో నూతన సచివాలయ భవనం నిర్మించారు. దానిని ఆనుకుని సుమారు రూ.3 లక్షలతో ఇ ఇ బిల్డింగ్ (కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్) పురుషులు, స్త్రీలకు విడివిడిగా రెండు బాత్‌రూమ్‌లు నిర్మించి పంచాయతీకి అప్పగించారు. అయితే సమీపంలోని ప్రైవేటు వ్యక్తి అవి మా స్థలంలో ఉన్నాయంటూ ఇటీవల వాటిని నిర్లక్ష్యంగా కూల్చివేసి అసలు అక్కడ వాటి ఆనవాళ్లు లేకుండా చేశాడు. సదరు వ్యక్తి ఇంత దారుణానికి ఒడిగట్టిన విషయం అందరికీ తెలిసినా అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేదన్నట్లు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా ఒక ప్రభుత్వ భవనాన్ని కూల్చాలంటే స్పష్టమైన అనుమతులతో అధికారుల సమక్షంలో పనులు చేపట్టాలి. కనీసం సచివాలయ భవనం ప్రారంభం కాకుండానే ఇలా లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన కట్టడం కూల్చివేయడం వెనుక అంతర్యం ఏంటో అర్థం కావడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇటీవల దీనిపై గ్రామ ఉపసర్పంచ్ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. లోపాయికారి ఒప్పందాలే ఇందుకు కారణమని, అందుకే ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై కాళ్ల డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావును వివరణ కోరగా సదరు భవనం విషయం తన దృష్టికి వచ్చిందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



ప్రభుత్వ భవనాన్ని కూల్చివేస్తున్నారని నేనే స్వయంగా వెళ్లి పంచాయతీలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో గత నెల 23వ తేదీన కలెక్టర్ దగ్గరికి వెళ్లి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశా. దానిపై ఇటీవల డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు వచ్చి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలి అని సంతకం తీసుకున్నారు. మరుసటి రోజు ఉదయం సమస్య పరిష్కారమైందంటూ నా మొబైల్‌కి మెసేజ్ వచ్చింది. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు ఈ విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సబబు. ఈ విషయంపై మరలా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి న్యాయపోరాటం చేస్తా.

– గునుపూడి ప్రసన్నకుమార్, ఉప సర్పంచ్, బొండాడ

జిల్లా జూనియర్ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

పెంటపాడు: ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయ ఇంగ్లీషు మీడియం స్కూల్లో శనివారం అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొనగా 12 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 14 నుంచి 17 వరకు పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి జి. శ్రీనివాసరావు తెలిపారు. అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ, సరస్వతి విద్యాలయ డైరెక్టర్ కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు (వెంకట్), స్కూలు పీడీ సత్యకిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

పోలియో కేసులు లేవు

వేలేరుపాడు: జిల్లాలో ఎక్కడా పోలియో కేసులు నమోదు కాలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పీజే అమృతం స్పష్టం చేశారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ కోసం వచ్చిన వారిలో వేలేరుపాడు నుంచి వచ్చిన కొందరిలో పోలియో లక్షణాలు ఉన్నాయని మీడియాలో రావడంతో డీఎంహెచ్ఓ, పిల్లల వైద్యుడు, ఆర్థోపెడిక్ సర్జన్‌లతో కూడిన బృందం మేడేపల్లి, వేలేరుపాడు గ్రామాలను శనివారం సందర్శించి 75 కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ అమృతం మాట్లాడుతూ శుక్రవారం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో సదరం శిబిరంలో 110 మంది అంగవైకల్య పరీక్షలకు హాజరుకాగా వారిలో 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఇద్దరు పిల్లలు సెరిబ్రల్ పాల్సీ, మెనింగోమైలోసెల్ (పుట్టుకతో వచ్చే రుగ్మత) అని, అది పోలియో కాదన్నారు. ఇతర కేసుల్లో కొందరికి 2008కి ముందు అవశేష పక్షవాతంతో జన్మించారన్నారు. ఏలూరు జిల్లాలో అక్యూట్ ఫ్లాసిడ్ పక్షవాతం పరీక్షను 7 మంది పిల్లలకు చేయడం జరిగిందని, వారిలో ఒకరు జంగారెడ్డిగూడెం నుంచి వచ్చారన్నారు. మల నమూనాలను సేకరించి చెన్నైలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపామని, అందులో పోలియో నెగెటివ్ అని నివేదిక వచ్చిందన్నారు. రాష్ట్రంలో చివరిగా పోలియో కేసు 2008 సంవత్సరంలో గుర్తించడం జరిగిందని, అప్పటి నుంచి ఏలూరు జిల్లాలో పోలియో కేసు నమోదు కాలేదని వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

స్థలము + భవనం అమ్మకం
1. భీమవరం, గునుపూడి నందు 260 చ॥గజలలో గల జి + 3 నివాస భవనము కనీసపు ధర రూ.1,32,00,000/- గా నిర్ణయించి బ్యాంకు వేలము నందు అమ్మబడును.
2. భీమవరం, రాయలం నందు 822 చ॥గజల నివాస స్థలము కనీసపు ధర రూ.60,00,000/- గా నిర్ణయించి బ్యాంకు వేలము నందు అమ్మబడును.
98496 36969
79951 98451



PLOT FOR SALE
■ తాడేపల్లిగూడెం, విద్యుత్‌నగర్ కాలనీ, పడమర 280 చ.గ 36x70 స్థలం అమ్మబడును. వివరాలకు ఫోన్: 9848191345 [SCA25006707]



■ ఏలూరులో హోటల్ నందు పనిచేయుటకు క్యాషియర్‌లు M/F కావలెను. సెల్ : 9441166829, 6302544456 [G-652]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25006667]

■ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పని చేయుటకు నర్సులు, కేర్ టేకర్లు, ఆడ/మగ/జంట కావలెను. ఫోన్: 9347556162 / 8309615249 [HA-58956]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 8985114453, 9391036931 [HA-16101]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-16111]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9963521122, 9963101122 [B-1275593]



గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్
- అర్ధ సంవత్సర నేర సమీక్ష, కోఆర్డినేషన్ సమావేశం


నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ శివకిషోర్, న్యాయ, ఎక్సైజ్, రవాణా శాఖ ఉన్నతాధికారులు

ఏలూరు టౌన్: నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అధ్యక్షతన ఏలూరు జిల్లా అర్ధసంవత్సర నేరసమీక్ష, కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, పురోగతి, నిందితుల అరెస్టులు, కోర్టుల్లో చార్జిషీటు దాఖలు వంటి అంశాలపై పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, బాధితులకు న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీక్లీ ప్రోగ్రెస్ రిపోర్ట్ తయారు చేసుకుంటే దర్యాప్తు వేగంగా పూర్తి అవుతుందన్నారు. పోక్సో కేసులు, బాలికల మిస్సింగ్ కేసుల్లో 90 శాతం దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. పోక్సో కేసుల్లో 60 రోజుల్లో కేసులు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేయాలని, నిందితులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. ప్రాసిక్యూషన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శారదామణి మాట్లాడుతూ జిల్లాలో కోర్టు మోనిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి ఎస్పీ శివకిషోర్ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేయడంతో కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నాయని స్పష్టం చేశారు. దర్యాప్తులో పోలీస్ అధికారులు శ్రద్ధ చూపించటంతో ఇటీవల పోక్సో కేసుల్లో కఠిన శిక్షలు పడుతున్నాయని తెలిపారు. రవాణాశాఖ అధికారి కృష్ణారావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ కేపీ శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని, నేరాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులు బాధితులకు న్యాయం అందించేలా మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు జీజీహెచ్ అధికారి జాగీ, ఎక్సైజ్ జిల్లా అధికారి ఆవులయ్య, డీఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పారిజాతగిరిలో మార్మోగిన గోవింద నామస్మరణ

ఆలయ గిరి ప్రదక్షిణ మార్గం ప్రారంభం


గిరి ప్రదక్షిణ మార్గాన్ని ప్రారంభిస్తున్న శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

జంగారెడ్డిగూడెం: భక్తుల గోవింద నామ స్మరణలతో గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రం పులకించింది. దేవస్థానంలో పారిజాత గిరి కొండ చుట్టూ నిర్మించిన ప్రదక్షిణ మార్గాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి విశేష భక్తజన సందోహం మధ్య శనివారం ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామి వారిని దర్శించారు. ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను అభివృద్ధి కమిటీ సహకారంతో ఆలయ ఈవో కలగర శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, గిరి ప్రదక్షణ మార్గానికి ఆర్థిక సహకారం అందజేసిన మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు, పార్టీ మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు గిరిప్రదక్షిణ చేశారు.



క్లుప్తంగా

వరాల వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసి యున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ జరిపారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి

ఇరగవరం: కార్మికులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పలువురు ఎక్సైజ్ సీఐ మణికంఠ రెడ్డి తెలిపారు. ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రు గ్రామంలోని వాన్ బెర్రీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేసే కార్మికులు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల వచ్చే అనార్థాలను కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వాన్ బెర్రీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ ఎస్.ఎస్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ కేసులలో పెండింగ్‌లో ఉన్న ఛార్జీషీట్లు పూర్తి చేయాలని, బాధితులకు నష్టపరిహారం అందజేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటి మిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం జరిగిన మాల మహానాడు సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, గిరిజనులపైన జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలన్నారు. స్మశాన భూములు లేని గ్రామాలలో భూములు కేటాయించాలని, గ్రామాల్లో ప్రధాన సమస్యలపై జిల్లా కలెక్టరేట్‌లో మెమోరాండాలు ఇవ్వడం జరిగిందన్నారు. భూబకాసురులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, సెంట్ భూమి లేని ఎస్సీ, ఎస్టీలకు పంచేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల సమాఖ్య జేఏసీ నాయకులు గంటా సుందర్ కుమార్, కె.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘ సమావేశం

ఆకివీడు: ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘం విస్తృత స్థాయి సమావేశం స్థానిక రైస్ మిల్లర్స్ భవనంలో ఆదివారం నిర్వహిస్తామని జిల్లా సంఘ అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో స్వర్ణకార వృత్తిలో విశిష్ట సేవలందించిన వారికి అత్యుత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. స్వర్ణవృత్తి పరిరక్షణపై, బ్యాంకు అప్రయిజర్స్ సమస్యలపై చర్చిస్తామని స్పష్టం చేశారు.

గొల్లవానితిప్పలో పిచ్చికుక్క స్వైర విహారం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి తొమ్మిది మందిని కరిచి గాయపరిచిందని గ్రామస్తులు తెలిపారు. ఉదయం స్కూల్‌కు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు, ఏడుగురు పెద్దలు, ఒక ఆవును కరవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాబిస్ వ్యాక్సిన్‌ను వేయించుకున్నారు. ఆ పిచ్చికుక్క ఎవరిని కరుస్తుందోనని గ్రామస్తులు భయాందోళనలు చెందారు. వీధికుక్కలు మందలుగా తిరుగుతూ భయపెడుతున్నాయని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

బ్యానర్ చించితే ప్రజాభిమానం ఆగుతుందా?

ఉండి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బ్యానర్‌లు చించినంతమాత్రాన ఆయనపై ఉన్న ప్రజాభిమానాన్ని ఆపలేరని గుర్తుంచుకోవాలని పాందువ్వ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొంతే హరీష్ అన్నారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన ఉండటంతో పంచాయతీ కార్యాలయం వద్ద జంక్షన్‌లో కట్టిన జగన్‌మోహన్‌రెడ్డి బ్యానర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చించివేశారని పేర్కొన్నారు. దీనిపై హరీష్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ బ్యానర్‌లు చించినంత మాత్రాన ప్రజాభిమాన్ని ఆపగలమని అనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పొందలేకపోతుందని ఇకపై మరింతగా దిగజారిపోవడం ఖాయమన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే

- వర్షాలతో మరింత అధ్వానం
- నాణ్యత లోపంతో కూటమి ప్యాచ్‌వర్కులు
- యాతన పడుతున్న వాహన చోదకులు

పెంటపాడు: గూడెంలో రహదారులు తీరు మారడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ప్రధానంగా రహదారుల తీరు మారుస్తాం. గుంతలు లేని నాణ్యమైన రోడ్లు వేస్తాం. అంటూ ప్రగల్భాలు పలికి నేడు వాటి విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా బాదంపూడి నుంచి ప్రత్తిపాడు, పెంటపాడు మండలంలో పలు రహదారులు గతం కన్నా మరింత గుంతలు పడి ఇబ్బందిగా తయారయ్యాయి. గత మూడు నెలల క్రితం ఈ రహదారులపై మరమ్మతులు చేశారు. దీనికి వర్షం తోడయ్యింది. ఎక్కడ గొౌతులు ఉన్నాయో వాహనచోదకులకు తెలియక ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఇటీవల ప్రత్తిపాడు- బాదంపూడి మధ్య గూడెంలో ప్యాచ్‌వర్కుల చేశారు. కానీ గత వారం రోజుల నుంచి కురిసిన వర్షం వల్ల పై పూతగా వేసిన తారు కొట్టుకు పోయింది. పెంటపాడు నుంచి విప్పర్రు మీదుగా గణపవరం వరకు రోడ్డు వేస్తున్నారు. కాగా ఆ రోడ్డు పూర్తి అవ్వలేదు. పైన కొంచెం పొరగా వేసిన తారు వర్షాకాలం రాకుండానే తొలగిపోయింది. కొన్ని చోట్ల రాళ్లు పైకి లేచి ఉండటంతో నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే రహదారుల తీరు మారుతుందని అనుకొన్న ప్రజలకు నిరాశే మిగిలిందని ప్రత్యక్షంగా ప్రజలు చెబుతున్నారు. వర్షాకాలం లోపే రహదారులు వేస్తామని చెప్పిన మాట నీటి మూట అయ్యిందని ప్రజలు చెబుతున్నారు. ప్రధానంగా ప్రత్తిపాడు దుర్గమ్మ ఆలయం నుంచి ప్రత్తిపాడు సెంటర్‌కు వెళ్లే రహదారికి మరమ్మతులు చేశారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల ఉన్న గోతులు మరింత పెద్దవిగా తయారయ్యాయి. ఈ రహదారిలో క్వారీ లారీలు ఎక్కువగా తిరగడం వల్ల కూడా ప్యాచ్‌వర్కులు పనిచేయలేదు. ఇప్పటికైనా మరమ్మతులు నాణ్యతతో చేయాలని ప్రజలు కోరుకొంటున్నారు.



పెంటపాడు మండలంలో గోతుల్లో చేరిన వర్షపు నీరు



యాగర్లపల్లి నుంచి జట్లపాలెం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై గోతులు



ప్రత్తిపాడు- బాదంపూడి రహదారి గోతుల్లో నిలిచిన వర్షం నీరు



రాళ్లు తేలిన పడమరవిప్పర్రు- గణపవరం రహదారి

అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ పునరుద్ధరించేదెప్పుడు?

రైల్వే అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం నూన్యం.

అత్తిలి: గతంలో నియోజవర్గ కేంద్రంగా ఉన్న అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్స్ పునరుద్ధరించాలని రైల్వేశాఖ ఉన్నతాధికారులు, కేంద్ర మంత్రులకు పలుమార్లు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, ప్రయాణికులు వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. మారుతున్న ఆధునిక కాలంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా, గతంలో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సేవలకు రైల్వేశాఖ మంగళం పాడింది. అత్తిలి పేరు చెప్పగానే గుర్తుకువచ్చేది వర్తక వ్యాపారులు. అత్తిలికి చెందిన అనేక మంది ఇక్కడ నుంచి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా వ్యాపారాలు చేస్తుంటారు. వీరంతా అత్తిలి రైల్వేస్టేషన్ నుంచి సుదూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్లపై ప్రయాణించేవారు. అయితే కోవిడ్ సమయంలో అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ను తొలగించారు. అప్పటి నుంచి అత్తిలి, పరిసర ప్రాంత రైల్వే ప్రయాణికులకు కష్టాలు మొదలయ్యాయి.

ప్రయాణికుల కష్టాలు

అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సుదూర ప్రాంతాలు రైలు ప్రయాణం చేసేవారికి అత్తిలి రైల్వేస్టేషన్ ఎంతగానో ఉపయోగపడేది. గతంలో అత్తిలి రైల్వేస్టేషన్‌లో 6 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, పూరి వంటి పట్టణాలకు అత్తిలి రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణించేవారు. రైల్వే డబ్లింగ్ పనులలో అత్తిలి రైల్వేస్టేషన్ ఆధునీకరించారు. రైల్వేస్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినప్పటికీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించలేదు. దీంతో అప్పటినుంచి దూర ప్రాంతాలకు ప్రయాణించేవారు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వస్తోంది.





అత్తిలి రైల్వే స్టేషన్ దృశ్యాలు

సమస్యను పరిష్కరించాలి

అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కడానికి అత్తిలి గ్రామానికి 15–25 కిలోమీటర్ల దూరంలో ఉన్న తణుకు, భీమవరం స్టేషన్‌లకు అవస్థలు పడి వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రెన్ ఎక్కేందుకు తణుకు, భీమవరం స్టేషన్‌లకు చేరుకోవడానికి అదనపు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఒక్కో సందర్భంలో సరైన సమయానికి చేరుకోలేక ట్రెన్‌లను ఎక్కలేకపోతున్నామని ప్రయాణికులు పేర్కొన్నారు. అత్తిలిలో కేవలం పాసింజర్ ట్రెన్‌లను మాత్రమే నిలుపుదల చేయడంతో, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. గతంలో మాదిరిగా అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, లయన్స్‌క్లబ్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థలు రైల్వే అధికారులకు, కేంద్ర మంత్రికి, ఇతర ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి కూడా సుబ్రహ్మణ్యస్వామి మాల ధారణ చేసిన భక్తులు వినతిపత్రం అందించి స్వామీ ! నీవైనా ప్రయాణికుల సమస్యను పరిష్కంచాలని కోరారు. అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అత్తిలిలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడిఈడు పిల్లలు తప్పక బడిలో ఉండాలని భవితా సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, హౌసింగ్‌బోర్డు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కే.చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డులో శనివారం పాఠశాలలో దివ్యాంగుల పిల్లలు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వార్డులో ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ భవిత విద్యార్థులకు ప్రత్యేక విద్య, ఉచిత ఉపకరణాలు, అలవెన్స్‌లు, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని చెప్పారు. దివ్యాంగుల పిల్లల లోపాలను చూడకూడదని, నార్మల్ పిల్లలు మాదిరిగానే దివ్యాంగులను చూడాలని, వారి అభివృద్ధికి కృషి చేయాలని, పిల్లల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలపై మరింత కరెంటు భారాలు వేసే స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం 6వ రోజు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ హౌసింగ్‌బోర్డులో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ గతం మరిచిన చంద్రబాబు తిరిగి స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమం అమలు చేస్తున్నాడని, బుద్ధి చెబుదామన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు సర్దుబాటు చార్జీలు రూపంలో పెను భారాలు వేసిందని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లతో అధిక రేట్లు వసూలు చేస్తారని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత ప్రజలకు కరెంట్ బిల్లులు చూస్తే షాక్ కొట్టేలా ఉంటాయని హెచ్చరించారు. నాయకులు శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, కన్నంరెడ్డి శివాజీ, దత్తు రాము, బొడ్డపాటి శివ, దుర్గా ప్రసాద్, యడ్ల శ్రీను, కె.ఉదయ్ కుమార్, పతివాడ నాగేంద్రబాబు పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గూడెంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

మరోసారి ఉప్పొంగుతున్న గోదావరి



సిద్ధాంతం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెనుగొండ: ఎగువ నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో పెనుగొండ, ఆచంట మండలాల్లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇప్పటికే రెండు సార్లు పెరిగిన గోదావరి శనివారం ఉదయం నుంచి మరోసారి ఉప్పొంగి ప్రవహిస్తుంది. గోదావరి ఉధృతితో సిద్ధాంతం, నడిపూడి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంలో పుష్కర ఘాట్లు నీటి మునిగాయి. మరో రెండు మూడు రోజుల పాటు గోదావరి ఉధృతి మరింత పెరగవచ్చనని అంచనా వేస్తున్నారు. దీంతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామం శివారు ప్రాంతంలో శుక్రవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్సై టి.వెంకట సురేశ్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారి వద్ద నుంచి రూ.3,400 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు.

ప్రతి పాఠ్యాంశంపై పట్టు అవసరం

తణుకు అర్బన్: ప్రతి పాఠ్యాంశంపై పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఇంటర్మీడియేట్ జిల్లా విద్యాశాఖాధికారి జి.ప్రభాకర్ అన్నారు. తణుకు ఎస్సీఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ సంస్కరణలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏపీ ఇంటర్మీడియేట్ విద్యామండలి ప్రవేశపెట్టిన విద్యావిధానం, సిలబస్ మార్పులు, కొత్త సబ్జెక్ట్స్ కాంబినేషన్స్‌తో పాటు మార్కుల పంపిణీ, అదనపు సబ్జెక్టుల ఎంపికలో విద్యార్థులు సరైన దిశగా వెళ్లేలా కృషి చేయాలని సూచించారు. అడిషినల్ సబ్జెక్ట్స్‌కు సంబంధించి ఎంపీసీ విద్యార్థులు అధనంగా బయాలజీ సబ్జెక్టును ఎంపికచేసుకుని నీట్‌కు అర్హత సాధించవచ్చన్నారు. బైపీసీ విద్యార్థులు అదనంగా మ్యాథమెటిక్స్ సబ్జెక్టును ఎంపిక చేసుకుని ఈఏపీసెట్, జేఈఈ మెయిన్స్‌కు అర్హత పొందవచ్చని వివరించారు. అనంతరం నూతన విద్యావిధానంలోని అంశాలను ప్రయోగాత్మకంగా స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు జూనియర్ కళాశాలల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ప్రగతి రాజా, తణుకు, అత్తిలి, తాడేపల్లిగూడెం, పెనుగొండ, పెంటపాడు మండలాలకు చెందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియేట్ జిల్లా విద్యాశాఖాధికారి ప్రభాకర్

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తత అవసరం

పెనుగొండ: ప్రస్తుత తరుణంలో సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆచంట ఎస్సై కట్టా వెంకట రమణ అన్నారు. శనివారం ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరగాళ్లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సోషలమీడియా పోస్టోల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కనబెడుతుందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమమైందని, దీంతో విద్యా సంవత్సరం పూర్తి చేసుకొని కొత్త కోర్సుల్లో జాయిన్ అవ్వాలనుకొనే విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు విద్యను ఎలా కొనసాగిస్తారు? అనిప్రశ్నించారు. ఇప్పటికైనా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయబద్ధంగానే ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నిక

ఆకివీడు: ఈస్ట్ ఆకివీడు బాప్టిస్టు ఫీల్డ్ కౌన్సిల్ ఎన్నిక న్యాయబద్ధంగానే జరిగిందని, ఒకరిద్దరు చేస్తున్న అసత్య ప్రచారం తగదని నూతనంగా ఏర్పడిన ఫీల్డ్ కౌన్సిల్ కమిటీ పేర్కొంది. ఈ మేరకు శనివారం స్థానిక ఉల్వర్డన్ పేట చర్చి ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కురెళ్ల రవి ప్రకాష్ మాట్లాడుతూ గత రెండేళ్లగా ఫీల్డ్ కౌన్సిల్ కమిటీ ఎన్నికలు జరగకపోవడంతో కార్యాకలాపాలు స్తంభించాయన్నారు. ఇటీవల సిద్ధాపురం గ్రామంలోని చర్చిలో 10 సంఘాల సభ్యులు సమావేశమై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారని చెప్పారు. మరో రెండు సంఘాల సభ్యులు హాజరుకాలేదన్నారు. వారికి కూడా నూతన కమిటీలో ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పారు. త్వరలోనే నూతన కమిటీ పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో కార్యదర్శి జీ.జోసఫ్‌రాజు, కోశాధికారి సుందర సింగ్, సభ్యులు బొడ్డు వజ్రం, మండా ఏసు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



ఉచిత హోమియో వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పిఠాపురంవారి నేతృత్వంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో బల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకున్న డాక్టర్ దండుపద్మావతి సౌజన్యంతో శనివారం గ్రామంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో 28 మందికి ఉచిత బీపీ పరీక్షలు జరిపి, హోమియో మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యబృందం, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

నేడు కొమ్మరలో ఉచిత కంటి వైద్య శిబిరం

అత్తిలి: మండలంలో అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా వారి సౌజన్యంతో ఆదివారం అత్తిలి మండలం కొమ్మర గ్రామ సచివాలయం వద్ద ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్షత్రియ సేవా సమితి సభ్యులు తెలిపారు. పరమ హంస యోగానంద నేత్రాలయ వారి ఆధ్వర్యంలో జరిగే ఈవైద్య శిబిరంలో మసక బారిన దృష్టి, దురద, కన్నుపొడిబారడం, అధిక రెప్పపాటు, కాంతిని భరించలేని దృష్టి, విపరీతమైన నొప్పి, చీకటిని చూడలేకపోవడం, మెరుపులు, కన్ను ఎర్రబడుట వంటి సమస్యలు ఉన్నవారికి వైద్యపరీక్షలు జరిపి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. కంటిలో అద్దాలు అమర్చి, కుట్లు లేకుండా శస్త్రచికిత్స చేస్తారని, ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యే వారు తమ ఆధార్‌కార్డును తెచ్చుకోవాలని కోరారు.

పదవుల్లో బీజేపీకి అన్యాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో బీజేపీకి అన్యాయం జరుగుతుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ బీజేపీ నుంచి డైరెక్టర్ పదవికి ఓసీ మహిళ పేరు ఇచ్చామని, అయితే పదవి ఇవ్వలేదని చెప్పారు. జనసేన, టీడీపీల మధ్య గ్యాప్‌లు ఉండటంతో బీజేపీకి అన్యాయం జరుగుతుందన్నారు. పదవులు వ్యవహారంలో బీజేపీ కార్యకర్తలు చాలా అసహనంగా ఉన్నట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం జరగనున్నదని, తమ కార్యకర్తలు, నాయకులు బాయ్‌కాట్ చేద్దామంటున్నారని ఆయన వెల్లడించారు. తమ అసహనంను గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే బీజేపీకి అన్యాయం చేయమని, కంగారు పడొద్దని అంటున్నారని, మరొక దాంట్లో న్యాయం చేస్తామని చెబుతున్నారని తెలిపారు. తాను ప్రమాణ స్వీకారానికి హాజరై తన అభిప్రాయాన్ని బహిరంగంగా చెబుతానని తాతాజీ వివరించారు.

సైనికుల సేవలు మరువలేనివి



మాధవరం అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పహారా కాస్తున్న సైనికుల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కార్గిల్ విజయ్ దివాస్‌ను శనివారం మండలంలోని మాధవరం గ్రామంలో నిర్వహించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ 1999 జులై 26వ తేదిన జరిగిన కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన సైనికులను స్మరించుకుంటూ ప్రతీ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, ఉప సర్పంచ్ బండారు నాగరాజు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లం వీరయ్య, గోపిశెట్టి భరతుడు తదితరులు పాల్గొన్నారు.





